# ఆంధ్రప్రదేశ్.. బడ్జెటరీ విధానం

**రాష్ట్రంలో గత నాలుగేళ్లుగా చేపట్టిన ఆర్థిక సంస్కరణలు... రాబడి, ద్రవ్యలోటులో స్థిరత్వం ఏర్పడటానికి దోహదం చేశాయి. రెవెన్యూ వ్యయాన్ని తగ్గించుకోవడమనేది ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో ఒక ముఖ్యాంశం. గత ఐదేళ్లుగా ద్రవ్య బాధ్యత, వినియమచట్టం (ఎఫ్ఆర్‌బీఎం) అమల్లో ప్రభుత్వం సఫలీకృతమైనప్పటికీ.. ప్రస్తుత సంక్షోభ ప్రభావం రెవెన్యూ రాబడులపై కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యయ నియంత్రణకు ఉపక్రమించింది. 2006-07తో పోల్చినపుడు 2007-08లో ప్రభుత్వ సొంత పన్నుల రాబడి 20 శాతం, ప్రభుత్వ సొంత పన్నేతర రాబడి 8.88 శాతం మేర పెరిగింది. మరోవైపు పెరుగుతున్న రుణభారం ఆందోళన కలిగించే విషయం. వ్యవసాయాభివృద్ధి ధ్యేయంగా గ్రామీణ ప్రజల జీవన ప్రమాణం పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం 81 నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేపట్టింది. ఈ నేపథ్యంలో విత్త యాజమాన్యానికి ప్రాధాన్యం ఏర్పడింది. ఈ క్రమంలో ప్రధానంగా ఈ అంశాలను స్పృశిస్తూ సిలబస్ రూపొందించారు.**

**పేపర్- III**
**విభాగం-2 యూనిట్-4 సిలబస్**

- రాష్ట్ర ఆర్థిక వనరులు, బడ్జెటరీ విధానం-పన్ను స్వరూపం, కేంద్ర పన్నుల పంపకం, రెవెన్యూ, మూలధన ఖాతాలోనూ, ప్రణాళిక, ప్రణాళికేతర ఖాతాలోనూ వ్యయ విధానం, ప్రభుత్వ రుణం-కూర్పు, ప్రపంచ బ్యాంకు రుణాలతో సహా దేశీయ, విదేశీ రుణాలు.

- **ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యయ నియంత్రణకు ఏ చర్యలు సూచిస్తారో వివరించండి?**

జ: రాష్ట్రంలో రెవెన్యూ వ్యయం, మూలధన వ్యయం రెండూ కలిపి మొత్తం వ్యయం 1997-98లో రూ. 16,269 కోట్లు కాగా ఇది 2008-09లో రూ. 85,113 కోట్లకు పెరిగింది. పన్నుల రాబడి, పన్నేతర రాబడి, కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా, ప్రణాళికా సంఘం



సిఫార్సు మేరకు ప్రణాళికా సహాయం, కేంద్ర ప్రభుత్వ స్పాన్సర్డ్ పథకాల గ్రాంట్లు వంటివి ప్రభుత్వ వ్యయం పెరగడానికి దోహదం చేశాయి. కానీ ప్రస్తుత సంక్షోభం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై కొంత మేరకు ప్రతికూల ప్రభావాన్ని చూపే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ద్రవ్య బాధ్యత, వినిమయ చట్టం సక్రమ అమలుకు రాష్ట్రప్రభుత్వం విత్త యాజమాన్య నిర్వహణ సక్రమంగా ఉండాలి.

☞ ప్రభుత్వం అనుత్పాదక వ్యయాన్ని తగ్గించుకొని ఉత్పాదక వ్యయాన్ని పెంచాలి. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి అవసరమైన మౌలిక సౌకర్యాల కల్పన కోసం ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించాలి. ఇందుకోసం రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వాలి. అదే విధంగా ప్రైవేటు రంగం తన సామాజిక బాధ్యతను గుర్తించేలా చూడాలి. పాలనా యంత్రాంగాన్ని పటిష్టంచేసి సంక్షేమ పథకాలు అనర్హులకు దక్కకుండా చర్యలు తీసుకోవాలి. బడ్జెట్ లోటును పూడ్చడానికి అధిక మొత్తంలో రుణాలను సేకరించడం మంచి చర్య కాదు. ప్రభుత్వం రెవెన్యూ వ్యయాన్ని తగ్గించుకొని మూలధన వ్యయాన్ని పెంచాలి. మూలధన వ్యయాన్ని అభివృద్ధి వ్యయంగా భావించాలి. సామాజిక సేవలపై పెట్టే పెట్టుబడులను ఉత్పాదక వ్యయంగా పరిగణించాలి. స్వయం ఉపాధి పథకాలకు ఇచ్చే సబ్సిడీ విధానం లోపభూయిష్టంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వ సొంత పన్నేతర రాబడి పెంచుకోవడానికి మరిన్ని చర్యలు తీసుకోవాలి. ముఖ్యం గా అడవులు, గనుల లీజు విధానాన్ని మార్పు చేసి ఆదా యాన్ని పెంచుకోవడానికి కృషి చేయాలి. స్వయం ఉపాధి పథకాలను ప్రోత్సహించకుండా గ్రామీణ ప్రాంతాల్లో కమ్యూనిటీ ఆస్తులను పెంపొందించడం కోసం వేతన ఉపాధి పథకాలు ఎక్కువగా చేపట్టాలి. తద్వారా గ్రామీణ పేదరికం తగ్గి ప్రజల జీవన ప్రమాణం పెరుగుతుంది. అనుత్పాదక పెట్టుబడులను తగ్గించాలి. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులపై పెట్టుబడులు తగ్గించకుండా వాటిల్లో కొన్నిటికి కేంద్ర ప్రభుత్వ (జాతీయ) ప్రాజెక్టుల హోదా దక్కేలా కృషి చేయాలి.

- **ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రాబడి మార్గాలను, వాటి ధోరణులను వివరించండి?**

**జ:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి రెవెన్యూ రాబడి, మూలధన రాబడి అనే మార్గాల ద్వారా రాబడి వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ పన్నుల ద్వారా రాబడి, పన్నేతర రాబడి, కేంద్ర పన్నుల్లో వాటా, గ్రాంట్లను రెవెన్యూ రాబడిలో చూపిస్తారు. రుణాల ద్వారా సమీకరించిన మొత్తాన్ని మూలధన రాబడిలో చూపిస్తారు. బహిర్గత మార్కెట్ రుణాలు, కేంద్ర ప్రభుత్వం నుంచి తీసుకున్న రుణాలు, డిపాజిట్ లావాదేవీలు, రుణాలు, అడ్వాన్సులను మూలధన రాబడిగా చూపిస్తారు. ప్రభుత్వానికి భూమిశిస్తు, అమ్మకం పన్ను, ఎక్సైజ్ సుంకం, స్టాంపులు, రిజిస్ట్రేషన్ పన్ను, మోటారు వాహనాలపై పన్ను ద్వారా ఆదాయం లభిస్తుంది. వడ్డీ చెల్లింపులు, డివిడెండ్లు, సాధారణ, సామాజిక సేవలు, ఆర్థిక సేవల ద్వారా పన్నేతర రాబడి వస్తుంది.

☞ ఈ క్రమంలో రెవెన్యూ, మూలధన రాబడుల్లో వివిధ అంశాలకు సంబంధించి ప్రభుత్వానికి లభించే ఆదాయ వివరాలు తెలుపుతూ భవిష్యత్తులో మొత్తం రాబడికి వివిధ అంశాల తోడ్పాటు (Contribution) ఎలా ఉండగలదో వివరించాలి.

- **ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ లోటు, ద్రవ్యలోటు స్థితిని వివరించి ద్రవ్య బాధ్యతా వినిమయ చట్టంలో అంశాలను రాష్ట్ర ప్రభుత్వం ఏ విధంగా సంతృప్తిపరచిందో వివరించండి?**

**జ:** రాష్ట్ర అవతరణ తర్వాత కొంతకాలం రెవెన్యూ మిగులు మరికొంత కాలం రెవెన్యూ లోటు కనిపించింది. 2006-07 నుంచి రెవెన్యూ మిగులు ఆర్జిస్తుంది. 1998-99 తర్వాత ద్రవ్యలోటు క్షీణించింది. 1998-99 తర్వాత కొంతకాలం రాష్ట్ర ఆర్థిక స్థితి క్షీణించడాన్ని గమనిస్తే ద్రవ్య సంస్కరణలు సక్రమంగా అమలు కాలేదని తెలుస్తుంది. 2006-07లో ద్రవ్యలోటు రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తిలో 2.04 శాతం కాగా 2007-08లో 2.68 శాతానికి పెరిగింది. 2009 మార్చి నాటికి ఎఫ్ఆర్‌బీఎం చట్టం ప్రకారం ద్రవ్యలోటును జీఎస్‌డీపీలో 3 శాతానికి తగ్గించడంలో రాష్ట్ర ప్రభుత్వం సఫలీకృతమైంది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ రుణం మార్చి 2008 నాటికి జీఎస్‌డీపీలో 25.12 శాతానికి చేరింది.

☞ ఈ క్రమంలో రాష్ట్ర అవతరణ తర్వాత వివిధ కాలాల్లో ద్రవ్య లోటు, రెవెన్యూ లోటు పెరగడానికి కారణాలు వివరిస్తూ 2004 తర్వాత ఎఫ్ఆర్‌బీఎం చట్టం సక్రమ అమల్లో భాగంగా రెవెన్యూ లోటు, ద్రవ్యలోటును ప్రభుత్వం నిర్వహించడంలో ఏవిధంగా విజయవంతమైందో వివరించాలి. ఈ యూనిట్‌కు సంబంధించి చాలా ప్రాధాన్యతతో కూడిన ప్రశ్న ఇది.

- **ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ, మూలధన వ్యయ ధోరణులను పరిశీలించి మొత్తం వ్యయం పెరుగుదలకు కారణాలను వివరించండి?**

**జ:** రాష్ట్ర ప్రభుత్వానికి రెవెన్యూ వ్యయం వల్ల ఏ విధమైన ఉత్పాదక సంపద ఏర్పడదు. సాధారణ సేవలు, సాంఘిక సేవలు, ఆర్థిక సేవలు, ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఇచ్చే విరాళాలు, సహాయక గ్రాంట్ల మొత్తాన్ని రెవెన్యూ వ్యయంలో చూపిస్తారు. రెవెన్యూ వ్యయం 1997-98లో రూ. 14,544 కోట్ల నుంచి 2008-09లో రూ. 67,619 కోట్లకు పెరిగింది. గత కొంతకాలంగా రాష్ట్రంలో మూలధన వ్యయం తగ్గుతుంది. ప్రభుత్వం మూలధన వ్యయాన్ని సాంఘిక సేవలు, సాధారణ సేవలు, ఆర్థిక సేవల నిర్వహణకు వ్యయం చేస్తుంది. 1997-98లో మూలధన వ్యయం రూ. 1086 కోట్లు. కాగా, 2007-08లో రూ. 12,774 కోట్లకు 2008-09లో రూ. 13,697 కోట్లకు పెరిగినప్పటికి ఈ వ్యయంలో పెరుగుదల రేటు తక్కువగా ఉండటాన్ని గమనించవచ్చు.

☞ ఈ క్రమంలో రాష్ట్రంలో రెవెన్యూ వ్యయం పెరగడానికి ఉద్యోగుల జీతభత్యాలతో పాటు, వ్యవసాయాభివృద్ధి కోసం చేపట్టిననీటి పారుదల ప్రాజెక్టులతోపాటు పలు సంక్షేమ కార్యక్రమాలపై వ్యయాన్ని చర్చించాలి. మరోవైపు రుణాల రూపంలో సమీకరించిన మూలధన రాబడిని మూలధన వ్యయంగా మరల్చలేకపోవడంలోని సమస్యలు వివరించాలి.

- **ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయాలను వివరించండి?**

**జ:** ప్రభుత్వ వ్యయాన్ని ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయంగా విశ్లేషించవచ్చు. ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయం రెండింటినీ రెవెన్యూ, మూలధన ఖాతాలో చూపిస్తారు. ప్రణాళికా వ్యయం 2009-10 బడ్జెట్‌లో మొత్తం వ్యయంలో 40 శాతానికి, ప్రణాళికేతర వ్యయం 60 శాతానికి పెరిగింది.

☞ ఈ క్రమంలో ప్రణాళికా వ్యయంలో రెవెన్యూ వ్యయం ఎక్కువగా ఉండటానికి కారణాలు వివరించాలి. దీంతో పాటు ప్రణాళికేతర వ్యయంలోని అంశాలను తెలిపి వాటి పెరుగుదల ధోరణులను విశ్లేషించాలి.

- **2009-10 బడ్జెట్‌లోని ముఖ్యాంశాలు వివరించండి?**

**జ:** ఆర్థికాభివృద్ధికి, పెట్టుబడులకు మధ్య ప్రత్యక్ష సంబంధమున్న నేపథ్యంలో అధిక పెట్టుబడుల ఆకర్షణకు రాష్ట్రప్ర భుత్వం ప్రాధాన్యమిచ్చింది. గృహ నిర్మాణం, పారిశ్రామిక పార్కుల ఏర్పాటు, రోడ్ల నిర్మాణం, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలకు సంబంధించిన పెట్టుబడులకు పెద్ద పీట వేసింది. ప్రాంతీయ సమతౌల్య అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చింది.

☞ ఈ క్రమంలో 2009-10 బడ్జెట్‌కు సంబంధించి ద్రవ్యలోటు, రెవెన్యూ లోటును గణాంకాల్లో వివరిస్తూ ముఖ్య రంగాలకు కేటాయింపులు వివరించాలి.

### ముఖ్యాంశాలు

- 2007–08లో రాష్ట్ర ప్రభుత్వ సొంత పన్నుల రాబడి రూ. 28,794 కోట్లు
- 2007–08లో రాష్ట్ర సొంత పన్నేతర రాబడి రూ. 7,064 కోట్లు
- 2007–08లో ప్రభుత్వ రుణంపై వడ్డీ చెల్లింపులు రూ. 7,589 కోట్లు
- 2007–08లో ద్రవ్యలోటు జీఎస్‌డీపీలో 2.68 శాతం
- 2007–08 చివరి నాటికి రాష్ట్ర ప్రభుత్వ రుణం రూ. 82,479 కోట్లు
- 2008–09 మూలధన వ్యయం మొత్తం బడ్జెట్‌లో 16.09 శాతం
- ఆంధ్రప్రదేశ్‌లో భూమిశిస్తు చట్టం 1967లో వచ్చింది
- రెవెన్యూ ఖాతాలో చేర్చని లావాదేవీలలో మార్కెట్ రుణాల మొత్తం ఎక్కువ
- 2009–10 బడ్జెట్‌లో ద్రవ్యలోటు జీఎస్‌డీపీలో 3.96 శాతం
- 2009–10 బడ్జెట్ మొత్తం వ్యయం రూ. 1,03,485.33 కోట్లు
- 2009–10 బడ్జెట్‌లో నీటిపారుదల రంగానికి కేటాయింపు రూ. 17,800 కోట్లు